# ద్వితీయప్రసంగము.

రెండవరోజు ఉదయమున శ్రీ ప్రకాశానందస్వామివారు శ్రీనిత్యానందస్వామివారి వద్దకు వచ్చి తాము 'జామ్' నగరు వెళ్ళ బోవుచున్నామని చెప్పిరి.

స్వా॥ ని॥ :—"తమరు 'గోండలు' వెళ్ళవలెను కదా!"

స్వా॥ ప్ర॥ :—"ఇప్పుడు 'గోండలు' వెళ్ళ నవసరము లేదు. 'జామ్' నగరు వెళ్ళవలెను."

అది విని నిత్యానందస్వామివారు నవ్వుచు నిట్లు చెప్పిరి :—

## త్యాగికి దిక్కునుగూర్చి నిర్బంధములేదు.

"ఒక జటాధారి ఉండెను. ఆయన ఒకనాడు తన శిష్యునితో నొక గ్రామమునకు వెళ్ళుచుండెను. దారిలో పెద్దగాలి చెలరేగెను. వెనుకనుండి గాలి తీవ్రముగా వీచుటచే జటాధారి జడలు ఎగిరి కండ్లమీదపడెను. దారి కన్పడకపోవుచుండెను. ముందుకు నడక సాగలేదు. అది చూచి శిష్యుడు 'గురువుగారూ! మీకు ముందుకు నడచుట చాలా కష్టముగా నున్నది. అందుచే గాలికి ఎదురుగా నడచుట మంచిది.' అనెను. జటాధారి గాలి కెదురుగా కొద్దిసేపు నడచి చూచెను. ఇదివరకు ముఖముమీదపడిన జడలు ఇప్పుడు వెనుకకు పోయి దారి కాన్పించెను. ఇది బాగున్నదని చెప్పి వారిద్దరు తాము వెళ్ళదలచిన దిక్కును మార్చి గాలికెదురుగాప్రయాణమును సాగించిరి. దీనివలన త్యాగులకు ఫలానా దిక్కునకే వెళ్ళవలెనను నిర్బంధము లేదని విశద మగుచున్నది."

అంతట అక్కడ కూర్చొనియున్నవారిలో ఒకరు శ్రీనిత్యానందస్వామివారి నిట్లు ప్రశ్నించిరి—

"శ్రీప్రకాశానందస్వామివారు చింకిరిపాతలతో కుట్టిన బొంతను ధరించుచున్నారు. అదేమి బాగుండలేదు. మంచిది ఇచ్చినచో స్వీకరింతురా?"

దీనికి శ్రీనిత్యానందస్వామివారు ఈ క్రిందిదృష్టాంతముతో సమాధానమిచ్చిరి.

## పీతాంబరులా, శ్వేతాంబరులా?

ఒక సంతు చలికాలపు రాత్రిసమయమున ఒక ఇల్లాలు చెంతకు భిక్షార్థ మరగెను. అప్పుడు అక్కడ కొందరు తత్త్వవిచారము చేయుచుండిరి. చాలారాత్రి ఆయెను. ఆ యిల్లాలు సంతుతో నిట్లనెను— "స్వామీ, చాలా ఆలస్యమైనది. ఇచ్చట నిద్రించుట యుక్తము. తమరు అనుమతించినచో ఏర్పాటుచేయుదును." ఆసంతు ఇట్లు చెప్పెను— "నేను బయట ఎక్కడనో ఒకచోట పరుండెదను. ఏ ఇంటియందును నిద్రించు ఆచారము నాకు లేదు. త్యాగి గృహస్థుని ఇంట ఉండుట ధర్మము కాదు. గృహస్థుడును త్యాగిని తన యింట నుంచుకొనుట ధర్మము కాదు. శవమునకు స్థానము శ్మశానము గాని గృహము కాదు." ఇట్లు చెప్పి ఆయన బయట పరుండెను. అది శీతకాలమైనందున భయంకరమైన చలి వేయుచుండెను. ఇది గమనించి ఆయిల్లాలు చెప్పెను— "తమవద్ద కప్పుకొనుటకు ఏమియు లేదు. చలి చాలా ఎక్కువగా నున్నది. బొంత తెచ్చి యిత్తునా?"

సంతు :—నాకెందు కమ్మా బొంత. చలి, ఎండ అన్నియు సహించు అలవాటు అయినది. అందుచే ఆరుబయట నిద్రపోగలను.

ఇల్లాలు :—క్షమ దయ.

సంతు కప్పుకొనుట కేమియు తీసికొనకుండా ఆరుబయట పరుండెను. ఆరాత్రి చాలా చలి వేసెను. సంతుకు చలి నోర్చు

కొను శక్తియున్ననుకూడా ఓర్చుకోలేనంత చలి వేసెను. ఏదైనా కప్పుకొనుట కున్నచో బాగుండునని తోచెను. చుట్టుపట్ల వెదకగా పెద్దపరికిణీవంటి గాగరా ఒకటి కాన్పించెను. దాని నెవ్వరో ఆరవేసి తీసికొనుట మరచిరి. దానిని కప్పుకొని ఆయన నిద్రించెను. మరు నాడు ఉదయమున ఆయిల్లాలు ఇది చూచి అడిగెను—"బాబు గారూ! ఇదేమిటి? బొంత తీసికొనుట మాని గాగరాను కప్పుకొం టిరే." సంతు ఇట్లనెను—"అమ్మా! ఇందులో వింత యేమున్నది! ఒకప్పుడు పీతాంబరుడను. మరియొకప్పుడు శ్వేతాంబరుడను. ఇంకొ కప్పుడు చిత్రాంబరుడను. అటులనే ఇప్పుడు గాగరాంబరుడను." అందుచే స్వామివారిని ఎవరు ఏమియు ఒత్తిడి చేయనవసరము లేదు. వారి యిచ్ఛానుసారము బొంతను ధరింతురు.

ఆసమూహామునుండి మరియొకరు స్వామివారి గురుస్థాన మెక్కడ? అని ప్రశ్నించిరి. నిత్యానందస్వామివా రిట్లు చెప్పిరి— "వారు స్థానవిశేషమునకు చెందిన శిష్యులు కారు. నేను స్థానవిశేష మునకు చెందిన శిష్యుడను." అంతట స్వాముల వారిరువురు సంభా షింపసాగిరి.

స్వా॥ ని॥ —మా గురుశ్రీ (బ్రహ్మవిద్యాగురువులు) జగ న్నాథస్వామివారు. నాకు సన్యాసము నిప్పించమని ప్రార్థించగా వారిట్లు చెప్పిరి—"మీది బ్రాహ్మణశరీరము. దండకమండలుధారి యగు సన్యాసివద్ద దీక్ష తీసికొనుడు." ఇట్లు చెప్పి శ్రీకపిలానంద సరస్వతిగారిపేరును నాకు సూచించిరి. అది నాకు ఇష్టము లేదు. కాని గురుశ్రీ ఆజ్ఞ. అచ్చటనుండి కపిలానందసరస్వతివారి మఠము నకు వెళ్ళితిని. వారు నాకు సన్యాసదీక్ష నొసగిరి. అచ్చట నేను రెండుమూడు రోజులుండి వచ్చివేసితిని. అప్పటినుండియు మరల ఆమఠమునకు నేను వెళ్ళియుండలేదు.

స్వా॥ ప్ర:—"ఒక బ్రాహ్మణకుమారుడు ఉండెను. సంసారములో అనేకములైన ఇబ్బందులు ఉన్నవనియు, జ్ఞానసంపాదనమునకు సన్యాసము ఉత్తమ మనియు అతనికి తోచెను. మంచిసన్యాసిని అన్వేషింపసాగెను. అప్పుడు అతనికి "ఫలానాగ్రామములో 'జ్ఞానమఠము' అనుమఠమున్నది. అందు మహావిద్వాంసులగు ఒక సన్యాసియున్నారు. వారియొద్దకు వెళ్ళుము." అని ఒకడు సలహా చెప్పెను. ఆతడు అచ్చటికి వెళ్లి ఆస్వామివారికి నమస్కారముచేసి కూర్చొనెను. స్వామివారు ప్రేమను వెల్లడించుచు "నీవు ఎవరవు? ఎందుకు వచ్చితివి?" అని యడిగిరి. ఆతడు "నేను బ్రాహ్మణకుమారుడను. సన్యాసదీక్ష గైకొనుటకు తమ సన్నిధికి వచ్చితిని" అని చెప్పెను. అంతట స్వామివారు "సరే. సన్యాసము తీసికొనుట వేళాకోళము కాదు. నాలుగైదు మాసములు ఇక్కడనే ఉండుము. నీకు పూర్ణవైరాగ్యము కలిగినదని తోచినప్పుడు దీక్ష నిచ్చెదను" అని నుడివిరి.

కొన్నిరోజులు తరువాత స్వామివారు తన మఠమునందలి వ్యక్తులను ఆతనికి పరిచయ మొనర్చుచు "ఈయన మా చిన్నగురువుగారు. ఈతడు నా సతీర్థుడు. ఈతడు నాశిష్యుడు" అని చెప్పెను. పిమ్మట తన విశాలమైన మఠమునందలి ప్రతిభాగమును వివరించుచు చూపించెను. ఇది గోష్ఠీమందిరము. ఇది సామాను గది. ఇది భోజనశాల. ఇది అతిథిగృహము. ఇది పడకగది. ఇది ధాన్యాగారము. ఇది మా ధనాగారము. అదుగో, చూడుము, పశువుల సాలలలో అశ్వములు, రథములు, ఆవులు, గేదెలు మొదలగునవి ఉన్నవి. ఏమియు లోపము లేదు. ఈమఠమునకు తోడు 5, 6 శాఖా మఠము లున్నవి. ఆయా నగరములలో దుకాణములు కలవు. వాటి అద్దె చాలా వచ్చును. అనేకమంది మహారాజులు, ధనవంతులు ఈ మఠమునకు సేవకులు. ఆ శ్రీమంతులు చాలాభూమిని జాగీరుగా

నిచ్చిరి. ఇంకా మిగిలిన ఆస్తులను కూడా పేర్కొని చెప్పెను. కాని ఆ వెట్రిభాగుల పిల్లవాడు శ్రీమంతుల బిడ్డ. పై వాటివలన వాని కేమాత్రమును ఆకర్షణ కలుగలేదు. అంతేకాదు. ఇవన్నియు చూచినపిదప అతనికి ఈ ఆలోచన కలిగెను. "ఇల్లు, వాకిలి మొదలగు ఉపాధులను విడచి ఇక్కడకు వచ్చితిని. ఇచ్చట పదిరెట్లు ఉపాధి కావచ్చుచున్నది. ఈ జ్ఞానమఠమునందు ఉండి జ్ఞానమును పొందుట్కు బదులు అజ్ఞానములో చిక్కుపడుదును. ఇది మంగలములోనుండి పొయ్యిలో పడినట్లు అగును. ఇంతకంటె నా యిల్లే మంచిది." ఇట్లు ఆలోచించి ఆతడు జ్ఞానమఠమును విడచి వెళ్లి పోయెను. ఇల్లు, వాకిలి విడచినవానికి మఠము ఎట్లు రుచించును?"

స్వా॥ ని:—"నేను సన్యాసదీక్షకై శ్రీకపిలానందస్వామివారి మఠమున ఉన్నప్పుడు 'ఇక్కడ చిక్కుపడిపోతినే, ఎట్లు బయటకు పోదును' అను చింత నన్ను వేధించుచుండెను. ఆస్వామివారికి ఇద్దరు శిష్యులు ఉండిరి. నేను ఆమఠమునకు ఉత్తరాధికారిని అయిపోవుదు నేమో యని వారి భయము. వారు లోలోపల నన్ను శంకించు చుండిరి."

స్వా॥ ప్ర:—"ఒక నైష్ఠిక బ్రాహ్మణుడు నదిలో స్నానము, సంధ్య చేసికొని ఇంటికి వచ్చుచుండెను. అప్పుడు త్రోవలో ఒక కుక్క ఎముకను నోట కరచుకొని తనప్రక్కనే వచ్చుచుండెను. అది చూచి ఆబ్రాహ్మణుడు "ఇది ఆఎముకను నాకు ముట్టించును' అను సంకోచముతో కొంచెము వెనుకకు తగ్గసాగెను. 'ఆ బ్రాహ్మణుడు ఎముకను తననుండి లాగుకొనును' అను అనుమానము కుక్కకు కలిగెను. అది గురకపెట్టుచు ఆబ్రాహ్మణుని తప్పించుకొని పారిపోసాగెను."

ఇది విని అక్కడ కూర్చున్నవారందరు పకపక నవ్వసాగిరి. తరువాత శ్రీప్రకాశానందస్వామివారు జామ్‌నగరు ప్రయాణమునకు సిద్ధమయిరి.

అంతట ఒకశ్రోత అడిగెను—తమరు ఇంతకుపూర్వము జామ్‌నగరు వెళ్లిరా?

స్వా॥ ప్ర:—"మొదట విక్రమశకమున 1957 సం॥న (1900 A. D) వెళ్ళితిని. తరువాత 1959 సం॥న (1902 A. D) తిరిగి వెళ్ళితిని. గత 9, 10 సంవత్సరములనుండియు వెళ్ళలేదు."

ఇంకొక శ్రోత అడిగెను—"జామ్‌నగరులో తమరు ఎక్కడ ఆసనము స్వీకరింతురు?"

స్వా॥ ప్ర:—"నేను ఆసనమును నాతో తీసికొని వెళ్లెదను. ఇష్టము వచ్చినచోట దానిని పరచుకొని కూర్చొనెదను. ఆసన మెల్లప్పుడు నాతోనే ఉండును. నేనెచ్చట కూర్చొనిన అదే నాయాసనము.

స్వా॥ ని:—"మాయ ఎంతో బలమైనది. ఒకచోట ఆసనము నేర్పరచుకొనినచో ఆస్థానమునందు మమత్వము ఏర్పడును. అందుచే నిజమైన త్యాగి ఏ ఒక్కచోటను ఆసనమును ఏర్పరచుకొనడు."

స్వా॥ ప్ర॥ "నేను హృషీకేశమున ఉన్నరోజులలో ఒక విద్వాంసుడగు సన్యాసి అచ్చట ఉండెను. ఆయన ఎవరితోను మాట్లాడెడివాడు కాడు. ఎవరితోను సాంగత్యము చేసెడివాడును కాదు. ఇది చూచి ఇతరమహాత్ములు ఆయనతో నిట్లనిరి—"తమరు విద్వాంసులు. ఇతరులతో మాట్లాడరు. తమవలన ఇతరుల కేమి లాభము? దయయుంచి మాట్లాడండి." ఆయన ఇట్లు చెప్పిరి—"నేను మౌనవ్రతమును అవలంబించలేదు. పశువులుకూడా మాట్లాడకుండా కాలక్షేపము చేయలేదా? నేను మాట్లాడకపోవుటలో విశేష

మేమిలేదు. కాని నేను మాట్లాడవలసినది ఏమున్నది? ఇల్లు విడచితిని; తల గొరిగించుకొంటిని; జేగురుబట్టలు కట్టుకొంటిని; భిక్షాటనము మొదలుపెట్టితిని. ఇంతవరకు వచ్చినా, ప్రజలు పూజించాలి, సన్మానించాలి అనే కోరికమాత్రము నశించలేదు. భిక్షమెత్తగా వచ్చిన అన్నమును గంగానదీతీరమున ఒకరాతిమీద పెట్టుకొని కూర్చొని తిందును. అదే శిలపై మరియొకరు కూర్చొని నచో, ఆరాతిమీద మరియొకడు కూర్చొనినాడే అనుభావము కలుగును. ఇట్లు ఇంకొకరితో సంబంధము పెట్టుకున్నకొలది అహంభావము, మమత్వము పెరుగును; తగ్గదు. ఇంక ఏమి చెప్పను?"

స్వా॥ ని॥ —దీనికి సంబంధించినదే రాజాగోపీచందుని దృష్టాంతము—"గోపీచందుని తల్లి మేనావతి. ఆమె గొప్ప విదుషీమణి; పూర్ణవైరాగ్యవంతురాలు. ఆమె కుమారునకు తాను నేర్పిన వైరాగ్యపాఠమును దిట్టము చేయుటకు వానిని భర్తృహరిచెంత నుంచెను. కొలది కాలము ఆముచ్చురు ఒకచోటనే ఉండిరి. మేనావతి తన కుమారుని వైరాగ్యపరిస్థితిని తెలిసికొనదలచి ఒకనాటి రాత్రిసమయమున ఇతరులకు తెలియకుండా పురుషవేషము ధరించి గోపీచందునకు కొంచెము దగ్గరగా పరుండెను. గోపీచందుడు మేల్కొని దగ్గర పరుండిన పురుషుని జూచి 'నాకు దగ్గరగా పరుండిన దెవరు? లేచి వెడలిపొండు' అనెను. వెంటనే మేనావతి లేచిపోయి భర్తృహరికిదగ్గరగా పరుండెను. భర్తృహరి అచటినుండి లేచి మరియొకచోటికి పోయి నిద్రించెను. మరునాటి ఉదయమున భర్తృహరి, గోపీచందుడును కూర్చొనియున్న సమయమున మేనావతి రాత్రి జరిగినవృత్తాంతమును వినిపించెను. ఆమె గోపీచందునితో నిట్లనెను. 'నీవు రాజ్యమును విడచి త్యాగిగా అరణ్యములో నివసించుచున్నావు. కాని నీయందు మమత్వము ఇంకా పోలేదు. నీవు పరుండిన భూమిని నీదిగా భావించితివి. ఈమమ

త్వమునకు కారణము నీకు ఇంకను సరియగు వివేకము కలుగకపోవుటయే' అని చెప్పి మేనావతి గోపీచందునకు కలిగిన వైరాగ్యమును దృఢపరచెను. భర్తృహరిమహారాజు వివేకముతో కూడిన వైరాగ్యముతో అరణ్యమునకు వెళ్లెను. అందుచే ఆయనయందు లేశమైనను మమకారము లేదు. గోపీచందుడు తల్లియుపదేశమున రాజ్యమును విడనాడి వనమునకు వెళ్లెను. అతనియందలి వైరాగ్యము వివేకరహితమైనందున కొంచెము మమకారము మిగిలియుండెను. రాజ్యసుఖమును విడనాడి అరణ్యవాసము చేయు మహాపురుషులందే మమకారము మిగిలియుండ మావంటివారి సంగతి ఏమని చెప్పవలెను."

ఒకచోట ఆసనము ఏర్పరచుకొనవలె నను భావము అంతతో ఆగదు. మంచివస్త్రములు, పాత్రలు మొదలగునవి ఉండవలె నను మోహము కూడా పుట్టును. ఇట్టి మోహములు కలుగకుండుటకు గుడ్డపీలికలు, మృణ్మయపాత్రము మొదలగువాటితో కాలక్షేపము చేయవలెను. శాస్త్రమునందిట్లు చెప్పబడినది.

కపాలం వృక్షమూలాని కుచైలమసహాయతా ।
ఉపేక్షా సర్వభూతానాం ఏతావద్భిక్షులక్షణమ్ ॥

"చేతిలో మట్టికుండ, చెట్టుక్రింద నివాసము, జీర్ణవస్త్రములు, ఇతరుల సహాయము స్వీకరించకపోవుట, సర్వప్రాణులయందును ఉపేక్షాభావము—ఇవి భిక్షుని లక్షణములు."

కపాలమ్:—త్యాగి నాలుగురకముల పాత్రలను వాడవచ్చును ఆనపకాయబుర్ర, కర్రపాత్ర, వెదురుగొట్టము, మట్టిపాత్ర. ఈనాలుగింటిలో "ఉత్తమం మృణ్మయం పాత్రమ్"—మట్టిపాత్ర ఉత్తమ మని చెప్పబడినది. మరియొక పాత్రమున్నచో దొంగలు దానిని ఎత్తుకుపోవచ్చును. మరల పాత్రముకొరకు ఇతరులను అర్థించవలసి

యుండును. ప్రతిచోట ఆపాత్రలు లభించకపోవచ్చును. మట్టిపాత్రమైనచో సర్వత్ర లభించును.

వృక్షమూలాని:—వేసవికాలమున చెట్టుక్రింద పరుండవలెను. ఇతరకాలములలో జీర్ణశిథిలావాసములలో నుండవచ్చును.

కుచైలమ్:—పాతబడి చినిగిపోయిన జీర్ణవస్త్రములను ధరించినచో మోహాము, మమకారము ఉండదు.

అసహాయతా:—సన్యాసి ఇతరులవద్దనుండి ఎట్టి సహాయమును స్వీకరించరాదు. తాను నివసించుటకు కుటీరమును కట్టించమనియు, కాశీకి టిక్కట్టుకొని ఇయ్యమనియు—ఇటువంటి కోరికలను కోరరాదు. ఇట్టి సహాయములను స్వీకరించరాదు.

ఉపేక్షా సర్వభూతానామ్:—ఉపేక్ష అనగా రాగద్వేషములు లేకుండ నుండుట. ఎవరియందును ప్రేమనుగాని, ద్వేషమునుగాని కలిగియుండరాదు. ఈ పైజెప్పిన వన్నియు సన్యాసిలక్షణములు.

స్వా॥ ప్ర॥ :—చేత కుండపెంకు పట్టుకొని, చెట్టుక్రింద పడియున్నా, మాయామయపదార్థములందు ఆశ నశించనంతవరకు కేవల బాహ్యప్రదర్శనములవల్ల ఎట్టి లాభము లేదు. శ్రీశంకరభగవత్పాదులిట్లు చెప్పిరి:—

*అగ్రే వహ్నిః పృష్ఠే భానుః రాత్రౌ చిబుకసమర్పితజానుః।*
*కరతలభిక్షా తరుతలవాసస్తదపి న ముఞ్చత్యాశాపాశః॥*

సాయంప్రాతస్సంధ్యాకాలములలో ఎదుట అగ్నిని పెట్టుకొనియు, పగటివేళ సూర్యునివైపు వీపునుంచియు, రాత్రివేళ గడ్డమునకు మోకాళ్ళు చేర్చి పరుండియు చలిబాధను తీర్చుకొనును. కరతలముతో భిక్షమును స్వీకరించును. చెట్టుక్రింద నివసించును. ఇవన్నియు నభ్యసించినా ఆశాపాశముమాత్రము ఆభిక్షువుని విడచుటలేదు, అని దాని భావము.

6

ఇంకొక శ్రోత శ్రీప్రకాశానందస్వామివారిని అడిగెను—

"జామ్ నగరులో తమకు పరిచితులు కలరా?"

స్వా॥ ని॥:—పరిచితులు లేకుండుటకే ఈవేషమును వారు ధరించిరి. పరిచితులసంఖ్య పెరిగిన కొలదియు యోగాభ్యాసమునకు విఘ్నములు కలుగును. అందుచేతనే సాధువులు, సన్యాసులు ఈప్రపంచమున గుప్తముగా నుండవలెను.

*యం న సన్తం న చాసన్తం నాశ్రుతం న బహుశ్రుతమ్ ।*
*న సువృత్తం న దుర్వృత్తం వేద కశ్చిత్ స వై యతిః ॥*

ఎవడు, ఇతరులనుగూర్చి వీడు మంచివాడా, చెడ్డవాడా, లేక, మూర్ఖుడా, పండితుడా లేక, మంచినడువడి కలవాడా, చెడుప్రవర్తన కలవాడా అను వివరములను తెలిసికొనకుండానే కాలక్షేపము చేయునో వాడే నిజమైన యతి.

ఇంకొక శ్రోత "శ్రీప్రకాశానందస్వామివారు ఈవేషమును ధరించియున్నారు. ఎవ్వరిని ఏమియు అర్థించరు. భిక్షకు లోపము కలుగదా?" అని ప్రశ్నించెను.

స్వా॥ ని॥:—"ఈ పృచ్ఛకుడు జామ్‌నగరుకు సిఫారసుత్తరము వ్రాసిన తమకు అభ్యంతరమా?" అని శ్రీప్రకాశానందస్వామివారి నడిగెను.

స్వా॥ ప్ర॥:—ఉత్తరము అవసరములేదు. ఉత్తరము ఒక ఉపాధి.

స్వా॥ ని॥:—*రథ్యాయాం బహువస్త్రాణి, భిక్షా సర్వత్ర లభ్యతే ।*
*భూమిశయ్యా సువిస్తీర్ణా యతయః కేన దుఃఖితాః ॥*

త్రోవలో చాలాచింకిబట్టలు, గుడ్డపీలికలు ఉండును. భిక్ష ప్రతిచోట లభించును. నిద్రించుటకు విశాలమైన భూమి కలదు. ఇంక యతులకు దుఃఖమేల? తీవ్రవైరాగ్యము నొందినవారు ఎట్టి స్థితిలోను దుఃఖించరు, వారిపట్ల ఎవ్వరును సద్భావమువహింప నవస

రము లేదు. వారు ఎక్కడకు వెళ్ళిన అక్కడ భగవానుడే అన్ని సదుపాయములను కలిగించును. గీతయందు భగవానుడు "యోగక్షేమం వహామ్యహమ్" అని చెప్పెను. పరమాత్మనగు నాయందు అనన్యభావముతో చిత్తమును లగ్నము చేయువాని యోగక్షేమములను నేను వహించుదును, అని దాని అర్థము.

అటు తరువాత శ్రీప్రకాశానందస్వామివారు జామ్‌నగరుకు వెళ్ళిపోయిరి.